

19న కలెక్టరేట్‌లో యూనియన్ బ్యాంక్ ప్రారంభం

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా వారి బ్రాంచిని శ్రీ పద్మావతి నిలయం కలెక్టరేట్‌నందు 19న ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, జేసీ డికె బాలాజీ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ సుభాష్‌తో కలిసి సత్యనారాయణ పూజ సోమవారం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి శ్రీనివాస రావు, యూనియన్ బ్యాంక్ ప్రాంతీయ అధికారి రాంప్రసాద్, శ్రీనివాస్ డిప్యూటీ రీజనల్ హెడ్, నగేష్ కుమార్ చీఫ్ మేనేజర్, మణి ప్రశాంత్ మేనేజర్, కార్తిక్ కుమార్ రావు బ్రాంచ్ మేనేజర్ తదితరులు పాల్గొన్నారు

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర మంగళవారం జరగనుంది. ఆలయ అధికారులు ఇప్పటికే అన్ని ఏర్పాట్లూ పూర్తి చేశారు. జాతర సందర్భంగా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేయనున్నారు ఇప్పటికే తిరుపతి అర్బన్ ఎస్పీ పలుమార్లు ఆలయ పరిసర ప్రాంతాల్లో సందర్శించారు. జాతరకు సుమారు 50 వేల నుంచి లక్ష మంది వచ్చే అవకాశాలు ఉన్నట్లు ఆలయ పాలకమండలి అంచనా వేసింది . తిరుపతి తాతయ్య గుంట గంగమ్మ జాతరకు తిరుపతి తో పాటు ఉమ్మడి చిత్తూరు జిల్లా నుంచి కాకుండా కర్ణాటక, తమిళనాడు నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చే అవకాశం ఉంది. బంధుమిత్రులు సైతం ఈ జాతరకు వచ్చి వెళుతుంటారు. గత మంగళవారం చాటింపుతో మొదలైన జాతర వారం రోజులు పాటు తిరుపతి వాసులు వివిధ వేషాలు ధరించి అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. తిరుపతి గంగమ్మ జాతర రాష్ట్ర పండుగ జాతరగా ప్రభుత్వం ప్రకటించడంతో తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి జాతర సంబంధించిన అన్ని కార్యక్రమాలు ఆయన చూస్తూ ఉన్నారు. గంగమ్మ ఆలయం నిర్మాణ పనులు జరుగుతూ ఉండడంతో జాతరకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అన్ని ఏర్పాట్లను ఎమ్మెల్యే దగ్గరుండి పనులు చేస్తున్నారు. గంగమ్మ ఆలయం గర్భగుడి పనులు మాత్రమే పూర్తి చేశారు. మిగిలిన పనులు వచ్చే నెలలో పూర్తిచేసే అవకాశాలు ఉన్నట్లు ఆలయ అధికారులు అంటున్నారు .ఇప్పటికే రాష్ట్ర మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, స్వాములు మఠాధిపతులు ,పీఠాధిపతులు గంగమ్మను దర్శించుకున్నారు. జాతరకు టీటీడీ, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ ,తుడా ,పోలీస్ శాఖతోపాటు ,విద్యుత్తు ,అగ్నిమాపక శాఖ అధికారులు వారి వంతున సహాయ సహకారాలు అందిస్తున్నారు. ప్రభుత్వ శాఖలూ గంగమ్మ జాతరకు సహాయ సహకారాలు అందిస్తున్నాయి. జాతరకు పొంగళ్ళు పెట్టుకోవడానికి తిరుపతి ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్‌ను సిద్ధం చేశారు. మంగళవారం కూరగాయల మార్కెట్‌కు సెలవు ప్రకటించారు.

రారండోయ్...జాతర చేద్దాం..!

నేడు తాతయ్యగుంట గంగమ్మ వేడుక

ఏర్పాట్లు పూర్తి - భారీ బందోబస్తు

నేడు ఎమ్మెల్యే అన్నదానం

ఆకాశాన్నంటుతున్న కోళ్లు, పొట్టేళ్ల ధరలు

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి నగరంలో నాటు కోళ్లు, బాయిలర్ కోళ్లు మేకలు, పొట్టేలు భక్తులు ఆలయం వద్ద జంతు బలి ఇవ్వనున్నారు. చిన్న కోడిపెట్ట రూ 500 కు అమ్ముతున్నారు .సోమవారం ఒక కేజీ నాటు కోడి రూ800-1000 రూపాయలు ధర పలుకుతోంది. బాయిలర్ కోళ్లు కూడా కేజీ కలిగిన కోళ్లు రూ600-800 ధర పలికాయి. పొట్టేలు 10 కిలోలు 9వేల రూపాయల నుంచి 12వేల ధర పలుకుతుంది. మేకపోతు 10 కేజీలు ఎనిమిది వేల నుంచి పదివేల రూపాయలు ధర పలుకుతుంది జాతర సందర్భంగా చుట్టుపక్కల గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో కోళ్లు మేకపోతు పొట్టేలు భక్తులు తెచ్చుకోవడం జరిగింది. ధరలు మాత్రం ఆకాశం అంటుతున్నాయి. ఇప్పటికే భక్తులు పొటేళ్లను కొనుగోలు చేసి ఇళ్ల వద్ద ఉంచారు. నేడు బలి ఇచ్చి, అనంతరం సకుటుంబ సమేతంగా జాతర జరుపుకోనున్నారు.

నేడు ఎమ్మెల్యే అన్నదానం

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర సందర్భంగా తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి మంగళవారం సుమారు 200 పొట్టేళ్లు కోసి పేదలకు అన్నదానం చేయనున్నారు. ఇప్పటికే తుడా ఇందిరా మైదానం వద్ద అన్నదానం సంబంధించి పనులు సిద్ధం చేశారు. గత ఏడాది జరిగిన గంగమ్మ జాతరలో ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి 100 పొట్టేలు కోసి పేదలకు అన్నదానం చేశారు.

అమ్మవారిని దర్శించుకున్న ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుపతి టౌన్

వెంగమ్మ దంపతులు

జేసీ దంపతులు

తిరుపతి తాతయ్యగుంట గంగమ్మ జాతర క్లైమాక్స్‌కు వచ్చింది.. మంగళవారం వేడుకగా తిరుపతి పురప్రజలు జాతరను జరుపుకుంటున్నారు. వివిధ వేషధారణలతో భక్తులు మొక్కులు తీర్చుకున్నారు. రాష్ట్ర నలుమూలల నుంచి వచ్చిన కళాకారులు, వైసిపి రాష్ట్ర నాయకుల హడావిడే ఈ సారి ఎక్కువగా కనిపించిందని చెప్పాలి. రాష్ట్ర మంత్రి అంబటి రాంబాబు సోమవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి తిరుపతి గంగమ్మకు సారె సమర్పించారు. రాష్ట్ర ప్రజలను చల్లగా చూడాలని గంగమ్మను వేడుకున్నట్లు మంత్రి మీడియాకు తెలిపారు. గత ఏడాదికంటే ఈ సారి అద్భుతంగా జాతర జరుగుతోందని వివరించారు. కొండమీద బ్రహ్మోత్సవాల తరహాలో వెంకటేశ్వర స్వామి చెల్లి గంగమ్మకు జాతర నిర్వహిస్తుండటం సంతోషకరమని అన్నారు. తిరుపతి ఎంఎల్ఎ భూమన కరుణాకర్‌రెడ్డి వేయి కళ్ల దుత్తతో మొక్కు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ శిరీష, ఆలయ కమిటీ ఛైర్మన్ కట్టా గోపీయాదవ్, ఈవో మునికృష్ణ పాల్గొన్నారు. జేసీ డికె బాలాజీ కుటుంబ సభ్యులతో దర్శించుకున్నారు. తిరుపతి రూరల్ ఎంపిపి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి గంగమ్మ తల్లికి పట్టు వస్త్రాలు సమర్పించారు. తన తండ్రి, తుడా ఛైర్మన్ చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, తల్లి లక్ష్మితో పాటు కుటుంబ సభ్యులతో కలిసి చంద్రగిరి నియోజకవర్గం తరపున ఊరేగింపుగా విచ్చేసి సారె సమర్పించారు. అలాగే స్విమ్స్ డైరెక్టర్ బి.వెంగమ్మ దంపతులు సారె సమర్పించారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ రామ్ పాల్గొన్నారు. తాతయ్యగుంట గంగమ్మ సోదరి పల్లివీధిలో వేషాలమ్మను సోమవారం నగర పాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష దంపతులు వైష్ణవి ఆస్పత్రి అధినేత డాక్టర్ మునిశేఖర్ దర్శించుకున్నారు. 25వ డివిజన్ కార్పొరేటర్ నరసింహ ఆచారి, వైఎస్‌ఆర్‌సిపి నాయకులు సునీల్ చక్రవర్తి మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ స్వాగతం పలికారు.

భక్తులకు అన్నదానం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

తిరుపతి గంగజాతరను పురస్కరించుకుని మాజీ ఎంపిపి రమేష్ యాదవ్ ఆధ్వర్యంలో సోమవారం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. స్థానిక తాతయ్యగుంట గంగమ్మ ఆలయ ఆవరణంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి నగర మేయరు డాక్టరు శిరీషా ముఖ్య అతిథిగా హాజరై అన్నదానం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 500 సంవత్సరాల పైగా చరిత్ర కల్గిన తిరుపతి గంగమ్మ జాతర రాయలసీమ లోనే చాలా విశిష్టమైనదన్నారు. ఈ ఏడాది రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర పండగగా ప్రకటించడంతో మరింత ప్రాధాన్యత సంతరించుకుందన్నారు. ప్రతి రోజూ వేలాది మంది భక్తులు అమ్మవారి ఆలయానికి వస్తున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా భక్తులకు అన్నదానం చేయడం సంతోషకరమని, నిర్వాహకులను అభినందించారు. అనంతరం సుమారు వెయ్యి మందికి పులిహోర, పెరుగన్నం, పొంగలి, వెజిటబుల్ బిర్యాని, సాంబారు రైస్ తదితర వాటిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ హేమాద్రిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, దత్తా గిరీష్‌యాదవ్ (సాయి), వెంకటేష్, కిరీటిరెడ్డి, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

శ్రీసిటీని సందర్శించిన పుదుచ్చేరి పరిశ్రమల కార్యదర్శి

ప్రజాశక్తి-వరదయ్యపాలెం

పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ కార్యదర్శి , కమీషనర్ పి.జవహర్, ఇతర సీనియర్ అధికారుల బందం సోమవారం శ్రీసిటీని సందర్శించింది. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి వారికి సాదర స్వాగతం పలికి, శ్రీసిటీ ప్రగతి, ప్రత్యేకతలు, ప్రపంచ స్థాయి మౌళిక సదుపాయాలు, పెట్టుబడిదారుల అనుకూల పర్యావరణ వ్యవస్థ, రాష్ట్ర ప్రభుత్వ ఆర్థిక ప్రోత్సాహకాల గురించి వివరించారు.

శ్రీసిటీ ఎండీతో చర్చల సందర్భంగా శ్రీసిటీ భూసేకరణ ప్రక్రియ, భూమి అభివద్ధి, మౌళిక సదుపాయాల అభివద్ధి, భూమి లీజింగ్ నమూనాలు, అభివద్ధి సమయంలో ఎదుర్కొంటున్న సమస్యలు, నైపుణ్యాభివద్ధి శిక్షణ చర్యలు ఇతర వివిధ అంశాలపై ఆసక్తిని కనబరిచారు. అనంతరం పారిశ్రామికవాడలో పర్యటించి మౌళిక వసతులను పరిశీలించారు. శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి మాట్లాడుతూ వాణిజ్యం, పరిశ్రమలు, విద్య, ఓడరేవులు, హౌసింగ్ తదితర విభిన్న రంగాలలో

అపారమైన అనుభవం ఉన్న పుదుచ్చేరి ఉన్నతాధికారులలో ఒకరైన జవహర్ కి ఆహ్వానం పలకడం గౌరవంగా భావిస్తున్నాము అన్నారు. ఆయన అభిప్రాయాలు, సూచనలు శ్రీసిటీ అభివద్ధికి మరింత ప్రోత్సాహకరంగా ఉంటాయన్నారు. ఈ పర్యటనలో పుదుచ్చేరి రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య శాఖ డైరెక్టర్, పిఐపిడిఐసి , ఎండీ రుద్ర గౌడ్, పిఐపిడిఐస్ జనరల్ మేనేజర్ సురేష్ రాజ్, పరిశ్రమలు, వాణిజ్య శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ ధన్ గోవింద్ పాల్గొన్నారు.

స్విమ్స్ అభివృద్ధిపై విస్తృతస్థాయి సమావేశం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్విమ్స్ హాస్పిటల్ అభివృద్ధిపై టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి, జెఈవో సదాభార్గవి, ఎఫ్ఎఅండ్ సిఎఓ బాలాజీ, డైరెక్టరు డాక్టరు వెంగమ్మ సమక్షంలో విస్తృతస్థాయి సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. స్థానిక స్విమ్స్ కమిటీ హాల్‌లో జరిగిన సమావేశంలో ఈవో మాట్లాడుతూ స్విమ్స్‌ను టిటిడి తీసుకున్న తర్వాత రాష్ట్రంలోనే కాక దేశంలోనే అత్యున్నత సంస్థగా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపట్టామన్నారు. అందుకు అనుగుణంగా వివిధ విభాగాలకు అవసరమైన వైద్య పరికరాలు, యంత్రాలు కొనుగోలుకు టిటిడి సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. అనంతరం స్విమ్స్‌లోని కార్డియాలజీ, కార్డియోథొరాసిక్ సర్జరీ విభాగాల్లో ఈవో పరిశీలించారు. ఈ కార్యక్రమంలో టిటిడి చీఫ్ ఇంజనీరు నాగేశ్వరరావు, పిఆర్‌వో టి.రవి, జిఎం సందీప్‌రెడ్డి పాల్గొన్నారు.

కమిషనర్ X బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్

ప్రజాశక్తి-వెంకటగిరి

గ్రూపు రాజకీయాలకు వెంకటగిరి మున్సిపల్ కార్యాలయం కేంద్రబిందువయ్యింది. సోమవారం మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్, బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ల మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. కమిషనర్ మీటింగ్‌కు రావాలని ఆదేశించినా రాకపోవడంతో టౌన్‌ప్లానింగ్ విభాగం రూమ్‌కు తాళం వేశారు. తాళం వేయడంతో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ దేవేందర, కమీషనర్ వెంకటరామయ్య మధ్య బహిరంగంగానే వాగ్వివాదం చోటుచేసుకుంది. ఒక దశలో బిల్డింగ్ ఇన్స్‌పెక్టర్ మీకు ఇష్టలేకపోతే మమ్మలను సరెండర్ చేయాలన్నారు. మీఇష్టం వచ్చినప్పుడు కార్యాలయాలకు వచ్చి పనులన్నీ పెండింగ్ పెట్టడం ఏమిటని ఆయనను కమీషనర్ ప్రశ్నించారు. టౌన్‌ప్లానింగ్ విభాగానికి జీతాలు పెట్టి దాదాపు నాలుగు నెలలు అవుతుందని, తాము పిల్లలను ఎలా పోషించుకోవాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వాపోయారు. కమీషనర్‌కు వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త రామ్‌కుమార్‌రెడ్డి అండదండలు మెండుగా ఉండడంతో తాను ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని తోటి సిబ్బంది వాపోతున్నారు. ఇకనైనా తమకు జీతాలు చెల్లించే విధంగా ఉన్నతాధికారులు చొరవ చూపాలని టౌన్‌ప్లానింగ్ సిబ్బంది వేడుకుంటున్నారు.

టౌన్‌ప్లానింగ్ విభాగానికి తాళం

రోజూ హాజరు నమోదు తప్పనిసరి : కమిషనర్

ప్రజాశక్తి -తిరుపతి టౌన్

నగరపాలక సంస్థ అధికారులు, సచివాలయ సిబ్బంది ప్రతి రోజూ ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నైజేషన్ సిస్టమ్) యాప్ ద్వారా హాజరు నమోదు తప్పక నమోదు చేయాలని కమిషనర్ హరిత అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరిగిన డయల్ యువర్ కమిషనర్, స్పందన కార్యక్రమంలో కమిషనర్ పాల్గొని ప్రజల నుండి వినతులు స్వీకరించారు. గతవారం వచ్చిన సమస్యల పరిష్కారం పై కమిషనర్ అధికారులతో సమీక్షించి ఎప్పటికప్పుడు సమస్యలు పరిష్కరించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డయల్ యువర్ కమిషనర్ కు 26 సమస్యలు ప్రజల నుండి వచ్చాయన్నారు. ముఖ్యంగా ఆక్రమణలు తొలగించాలని, డ్రైనేజీ కాలువల సమస్యలు, పింఛన్ కావాలి వంటి సమస్యలను ప్రజలు తమ దష్టికి తెచ్చారని అన్నారు.జాతర సందర్భంగా నగరంలోను, ఆలయం వద్ద ప్రత్యేకంగా పారిశుద్ధ్య పనులు చేపడుతున్నామన్నారు. గంగజాతరకు విచ్చేసే భక్తులకు త్రాగునీరు అందించేలా అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులూ కలగకుండా అధికారులు పర్యవేక్షణ చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ శ్రీలేఖ, అదనపు కమిషనర్ సునీత, ఉప కమిషనర్ చంద్రమౌళిశ్వర్ రెడ్డి, సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, రెవెన్యూ ఆఫీసర్ కే.ఎల్.వర్మ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ హరికష్ణ తదితులున్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కమిషనర్

'ఆలయం కట్టేందుకు అనుమతివ్వాలి'

ప్రజాశక్తి-తిరుపతి సిటి

వెంకటగిరిలో ఎస్‌సిలు రామాలయం కట్టుకోవడానికి అనుమతి ఇవ్వాలని జిల్లా కలెక్టరుకు ఎస్‌సి హక్కుల సంక్షేమ వేదిక జిల్లా కార్యదర్శి చీనేపల్లి కిరణ్ డిమాండు చేశారు. జిల్లా కలెక్టరేట్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ వెంకటగిరి మునిసిపల్ పరిదిలోని కోళ్లఫారం స్థలంలో 40 ఎస్‌సి కుటుంబాలు రామాలయం కట్టుకోవాలని భావించారు. టిటిడిని సంప్రదిస్తే 5 సెంట్ల భూమిని చూపిస్తే రామాలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం అందిస్తామన్నారు. ఈ విషయం స్థానిక రెవిన్యూ అధికారులకు విన్నవించడంతో కోళ్లపారం స్థలంలో ఆలయ నిర్మాణానికి 30 సెంట్ల స్థలాన్ని కేటాయించారని తెలిపారు. టిటిడి అధికారులు ఆ స్థలాన్ని పరిశీలించి వెళ్లారని, మే 1న రామాలయ నిర్మాణానికి భూమిపూజ చేసేందుకు ఎస్‌సిలు పూనకుంటే కొందరు దాన్ని అడ్డుకుని ఆ భూమి తమదని గొడవకు దిగడం బాధాకరమన్నారు.

అధికార పార్టీ నాయకులు ఏకపక్షంగా పంచాయతీ చేసి రామలయ నిర్మాణానికి 2 సెంట్లు మాత్రమే ఇవ్వాలని రెవిన్యూ అధికారులపై ఒత్తిడి తెస్తున్నారని విమర్శించారు. కలెక్టర్ ఈ వ్యవహారంపై స్పందించి ఎస్‌సిలు ఆలయ నిర్మాణానికి 30 సెంట్లు కేటాయించాలని, అడ్డుకున్న వారిపై అట్రాసిటి కేసు బనాయించాలని డిమాండు చేశారు. ఈ కార్యక్రమంలో సూర్యకిరణ్, లీలామోహన్, సుమన్, తదితరులు పాల్గొన్నారు.

గాజులమణ్యం గ్రామీణ సీఐగా సుబ్బారాయుడు



ప్రజాశక్తి -రేణిగుంట: రేణిగుంట మండలం గాజులమండ్యం పోలీస్ స్టేషనలో సోమవారం సుబ్బారాయుడు గ్రామీణ సీఐగా బాధ్యతలు తీసు కున్నారు. ఇక్కడ పనిచేస్తున్న హరోహరనరావు బదిలీ కావడంతో ఆయన స్థానంలో ఈయన బాధ్యతలు చేపట్టారు.

క్షుద్ర పూజలు కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి- రేణిగుంట: మండలంలోని తారకర నగర్ లో క్షుద్ర పూజలు చేస్తున్న వ్యక్తిని పోలీసులు అరెస్ట్ చేశారు. వారు తెలిపిన వివరాల మేరకు శ్రీకాళహస్తి చెందిన సుబ్బయ్య తెదేపా ఎస్ టి వి భాగం నాయకుడు. తారకరామా నగర్ లోని ఒక మహిళకు క్షుద్ర పూజలు చేస్తానని చెప్పి ఆదివారం అర్ధరాత్రి అసభ్యకరంగా ప్రవర్తించాడు . దీంతో బాధిత మహిళ పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో సర్కిల్ ఇన్స్పెక్టర్ సుబ్బారెడ్డి కేసు నమోదు చేసి అతన్ని అదుపులో తీసుకున్నారు.

గీత కార్మికుడికి ఎమ్మెల్యే ఆర్థిక సాయం

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: కల్లు గీస్తూ ప్రమాదవశాత్తు కిందపడి తిరుపతిలో చికిత్స పొందుతున్న గీత కార్మికుడు పాపయ్యకు స్థానిక ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఆర్థిక సాయం అందజేశారు. సోమవారం ఆయనకు రూ.10 వేలు ఆర్థిక సాయం చేశారు.

ఎంఎల్‌సిగా సిపాయి ప్రమాణ స్వీకారం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

స్థానిక సంస్థల ఎంఎల్‌సిగా గెలుపొందిన తిరుపతికి చెందిన డాక్టరు సిపాయి సుబ్రమణ్యం సోమవారం ప్రమాణస్వీకారం చేశారు. ఇటీవల జరిగిన ఎంఎల్‌సి ఎన్నికల్లో ఉమ్మడి చిత్తూరు జిల్లా స్థానిక సంస్థల నుంచి డాక్టరు సిపాయి సుబ్రమణ్యం ఏకగ్రీవంగా ఎన్నికైన విషయం విదితమే. అందులో భాగంగా సోమవారం తాడేపల్లిలోని శాసనమండలి ప్రాంగణంలో శాసనమండలి చైర్మన్ మోజేష్‌రాజు నూతనంగా ఎన్నికైన ఎంఎల్‌సిల చేత ప్రమాణస్వీకారం చేయించారు. ఈ నేపథ్యంలో తిరుపతికి చెందిన డాక్టరు సిపాయి సుబ్రమణ్యం వరసక్రమంలో ప్రమాణస్వీకారం చేశారు. ఈ సందర్భంగా పలువురు డాక్టరు సిపాయి సుబ్రమణ్యంకు శుభాకాంక్షలు తెలిపారు.

ఎంఎల్‌సి సిపాయి సుబ్రమణ్యం ప్రమాణ స్వీకారం

ఏపీలో 2024 ఎన్నికల్లో కాంగ్రెస్‌దే విజయం

ప్రజాశక్తి-తిరుపతి సిటి

2024లో ఆంధ్రప్రదేశ్‌లో జరిగే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అత్యధిక సీట్లతో అధికారంలోకి వస్తుందని మాజీ కేంద్ర మంత్రి డాక్టరు చింతా మోహన్ ధీమా వ్యక్తం చేశారు. స్థానిక రాజీవ్‌గాంధీ విగ్రహం వద్ద సోమవారం జరిగిన నిరసన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ కర్ణాటక ఎన్నికల ఫలితాలతో అందరూ కాంగ్రెస్ వైపు చూస్తున్నారని, 2024లో కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ కాంగ్రెస్ అధికారంలోకి వస్తుందని అభిప్రాయపడ్డారు. రాష్ట్రంలో దళితులు, బలిజలు, కాపులు కలిసికట్టుగా అధికారాన్ని పంచుకుందామని పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాలు కాపు, బలిజలు, రెండున్నర సంవత్సరాలు దళితులకు ముఖ్యమంత్రి పదవి ఇచ్చేలా కాంగ్రెస్ అధిష్టానాన్ని తాను ఒప్పిస్తానన్నారు. ధర్మాన్ని కాపాడాల్సిన టిటిడి అధర్మంగా వ్యవహరిస్తోందన్నారు. పారిశుద్ధ కార్మికులు జీతాలు పెంచడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని పేర్కొన్నారు. తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ టౌన్ ప్లానింగ్ విభాగంలో అవినీతి విచ్చలవిడిగా పెరిగిపోయిందన్నారు. ఒక

ఫ్లోర్‌కు రెండున్నరలక్షల రూపాయలు వసూలు చేస్తున్నారని విమర్శించారు. కార్పొరేషన్ పరిధిలో 800 మంది కార్మికులు పని చేస్తుంటే అందులో 300 మందిని అధికారులు తమ ఇళ్లలో పనికి వాడుకుంటున్నారని తెలిపారు. పెరిగిన ధరలకు అనుగుణంగా టిటిడి, తిరుపతి మునిసిపల్ కార్పొరేషన్, రుయా ఆసుపత్రి, తిరుపతిలోని ఏడు యూనివర్శిటీలలో పని చేసే కార్మికులకు ప్రతి నెలా 20వేల వేతనం చెల్లించాలని డిమాండు చేశారు. నాయకులు యార్లపల్లి గోపి గౌడ్, రవి, పూతలపట్టు ప్రభాకర్, మించల తేజోవతి, శాంతి యాదవ్, సుబ్బలక్ష్మి, మునిశోభ పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయం

● లోకేష్ యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి ● టీడీపీ నాయకుల సంఘీభావం

ప్రజాశక్తి - గూడూరు : యువగళం రథసారథి, తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా గూడూరు నుంచి చెన్నూరు వరకు వేలాది మంది టీడీపీ కార్యకర్తలు, నాయకులు, సంఘీభావ ర్యాలీని డాక్టర్ పాశం సునీల్ కుమార్ నాయకత్వంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో పాలన గాడిదప్పిందని.. ప్రజలను పాలించాల్సిన నాయకులు, పరిపాలన గాలికొదిలి ప్రతిపక్ష నాయకులపై కక్ష సాధింపు చర్యలు చేపట్టడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నారన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీదే విజయమని.. వైసీపీలో అభివృద్ధి పూర్తిగా శూన్యమైందని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర నిర్వాహక కార్యదర్శి శీలం కిరణ్ కుమార్ , రాష్ట్ర కార్యదర్శి నెలబల్లి భాస్కర్ రెడ్డి , జిల్లా అధికార ప్రతినిధి బిల్లు చెంచురామయ్య , గూడూరు పట్టణ అధ్యక్షులు పులిమి శ్రీనివాసరావు , గూడూరు రూరల్ మండల అధ్యక్షులు కొండూరు వెంకటేశ్వరరాజు , చిల్లకూరు మండల అధ్యక్షులు వెంకటేశ్వర్ రెడ్డి , కోట మండల అధ్యక్షులు మద్దాలి సర్వోత్తమ్ రెడ్డి , వాకాడు మండల అధ్యక్షులు దువ్వూరు మధుసూదన్ రెడ్డి , జిల్లా క్రిస్టియన్ సెల్ తాతపూడి ఇజ్రాయిల్ కుమార్ , తెలుగు మహిళ జిల్లా ప్రధాన కార్యదర్శి మట్టం శ్రావణి , తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి బత్తిన ప్రణీత్ యాదవ్ , మైనార్టీ సెల్ నియోజకవర్గం అధ్యక్షులు అబ్దుల్ రహీం , బాలకష్ణ , ఎస్సీ సెల్ నియోజకవర్గ అధ్యక్షులు ఏసుపోగు పెంచలయ్య , తెలుగు మహిళా జిల్లా కార్యదర్శి గుండాల భారతి , తెలుగు మహిళ నియోజకవర్గ అధ్యక్షురాలు సుబ్బమ్మ, తెలుగు మహిళ పట్టణ అధ్యక్షురాలు గుండాల శ్రీదేవి తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పుత్తూరు టౌన్: పట్టణంలోని శ్రీ కామాక్షి సమేత శ్రీ సదాశివేశ్వర స్వామి ఆలయంలో సోమవారం పుత్తూరు టిడిపి పట్టణ అధికార ప్రతినిధి జి.బాబు, నగరి నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి గాలి భానుప్రకాష్ ఆదేశాల మేరకు నారా లోకేష్ నిర్వహిస్తున్న యువగలం పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సంఘీభావం తెలుపుతూ 101 కొబ్బరికాయలను ఆలయ ఆవరణంలో కొట్టారు. రాబోయే 2024 ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయం సాధించాలని ఆయన కోరారు.

కోట: రాష్ట్రంలో అధికార వైసీపీ ప్రజా వ్యతిరేక పాలనతో విరక్తితో ఉన్న రాష్ట్ర ప్రజల్లోని ఆయా ప్రాంత ప్రజల స్వచ్ఛంద భాగస్వామ్యంతో తెలుగుదేశం జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు పాదయాత్ర దిగ్విజయంగా సాగుతోందని తిరుపతి జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యదర్శి తూపిలి రాధాక్రిష్ణారెడ్డి పేర్కొన్నారు. సోమవారం ఆయన కోటలో విలేకర్లతో మాట్లాడుతూ నాలుగేళ్ల వైసీపీ ప్రభుత్వ అరాచక, అభివృద్ధి నిరోధక, అప్రజాస్వామిక, రాజ్యాంగ వ్యతిరేక, అవినీతి, అణచివేత, అక్రమ కేసుల బనాయింపుతో కూడిన ఆటవిక పాలనతో అల్లాడుతున్న రాష్ట్ర ప్రజలకు అండగా నిలిచి, భరోసా కల్పించి ప్రజల తరపున పోరాడడానికి లోకేష్ బాబు చేపట్టిన 400 రోజులపాటు 4000 కిలోమీటర్ల సుదీర్ఘ పాదయాత్ర గత 100 రోజులుగా రాష్ట్ర ప్రజలకు భవిష్యత్తుపై ఆశను, నమ్మకాన్ని కలిగిస్తోందన్నారు.

తిరుపతి అర్బన్: టీడీపీ యువనేత నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర 100 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా టీడీపీ చిత్తూరు పార్లమెంటరీ అధ్యక్షుడు, చంద్రగిరి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పులివర్తి నాని ఆధ్వర్యంలో సోమవారం సంఘీభావ యాత్ర నిర్వహించారు. భారీ సంఖ్యలో తెలుగు తమ్ముళ్లు పాల్గొనగా కొత్త చెర్లోపల్లి శ్రీ ఆంజనేయ స్వామి ఆలయం నుంచి చంద్రగిరి టవర్ క్లాక్ వరకు పాదయాత్ర కొనసాగింది. చెర్లోపల్లిలో నాయకులు గజమాలతో సత్కరించి అభిమానం చాటుకున్నారు. టవర్ క్లాక్ వద్ద అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.430 కోట్లతో నియోజకవర్గాన్ని అభివద్ధి చేశానన్న స్థానిక ఎమ్మెల్యే ఏం చేశారో చెప్పాలని డిమాండ్ చేశారు. సంఘీభావ యాత్రలో మండల పార్టీ అధ్యక్షుడు సుబ్రమణ్యంనాయుడు, మండల ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాయల్, జిల్లా ఉపాధ్యక్షుడు గౌస్ బాషా, శక్కురు ధనంజయ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు, రాజులగారి వినోద్ కుమార్ రెడ్డి, ఎక్స్ జడ్పిటిసి విరంగారి రమేష్ రెడ్డి, ఏజీ పల్లి బాల, మొక్కల చంద్రశేఖర్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సునీల్, మహేష్ రెడ్డి,రఘునాథ రెడ్డి, కత్తి సుధా, ఐటిడిపి సోమనాథ రెడ్డి, విప్పర్ల రమేష్ నాయుడు, లోకేష్ నాయుడు, ఎక్స్ ఎంపీటీసీ తాంద్ర రుద్రయ్య, వినకొండ పుల్లయ్య నాయుడు, వై బాలముని నాయుడు, ప్రసాద్, విష్ణు, ఎల్లయ్య, లోక, మస్తాన్, మంగాపురం భాస్కర్, గోపీనాథ్, మన్సూర్, శంకర, హుస్సేన్, ఎస్సీ సెల్ అధ్యక్షుడు శంకర, అమ్ములమ్మ , సింగు సుధ, సుజాత, భులక్ష్మి, లంకెల లలిత, సుశీలమ్మ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర వంద రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా శ్రీకాళహస్తి నియోజకవర్గం ఇన్ ఛార్జి బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, ఆయన సతీమణి బొజ్జల రిషితా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం సంఘీభావ యాత్ర నిర్వహించారు. శ్రీకాళహస్తి మండలం గుంటకిందపల్లె నుంచి ప్రారంభమైన ఈ యాత్ర శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ వరకు సాగింది. మొదట గుంటకిందపల్లె ఆంజనేయస్వామి ఆలయంలో బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి దంపతులు, తెలుగుదేశం నేతలు ప్రత్యేక పూజలు నిర్వహించారు. నారా లోకేష్ చేపట్టిన 'యువగళం' పాదయాత్ర విజయవంతం కావాలని... పాదయాత్ర చేయడానికి కావాల్సిన శక్తిని నారా లోకేష్ కు ప్రసాదించాలని వారు స్వామి వారిని వేడుకున్నారు. అనంతరం గుంటకిందపల్లె నుంచి ఊరందూరు మీదుగా శ్రీకాళహస్తి పట్టణంలోని ఏపీసీడ్స్ కూడలి వరకు పాదయాత్ర చేశారు. ఈ పాదయాత్రలో వందలాది మంది తెలుగుదదేశం నేతలు, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నారు. తెలుగుదేశం పార్టీకి అనుకూలంగా నినాదాలు చేశారు. వచ్చే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీని గెలిపించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం నేతలు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సత్యవేడు: తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపడుతున్న యువగళం పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని సత్యవేడు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే హేమలత పేర్కొన్నారు. లోకేష్ చేపట్టిన పాదయాత్ర సోమవారంతో వంద రోజులు పూర్తి చేసుకోవడంతో యువగళానికి మద్దతుగా టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ హెలెన్ ఆధ్వర్యంలో సత్యవేడులో సంఘీభావ యాత్ర నిర్వహించారు. నాయకులు మునస్వామియాదవ్, మాజీ ఎంపీపీ మస్తాన్, మాజీ జెడ్పిటిసి సుమాంజలి, కాటయ్య, కన్నయ్య నాయుడు, ప్రవీణ్‌కుమార్ రెడ్డి, పరమశివం, నరేంద్ర, యుగంధర్ రెడ్డి, ఇలంగోవన్‌రెడ్డి, శివకుమార్, సుధాకర్‌నాయుడు, ఎండి కుమార్, చాన్‌బాషా, నజీర్ తదితరులు పాల్గొన్నారు.

ఏర్పేడులో పంచాయతీ కార్మికుల నిరసన

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పల్లె ప్రగతిలో కీలక భూమిక పోషిస్తున్న పంచాయతీ కార్మికుల కష్టాలను పట్టించుకోవాలని సిఐటియు జిల్లా అధ్యక్షుడు నాగభూషణం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సిఐటియు ఆధ్వర్యంలో సోమవారం ఏర్పేడు మండల పరిషత్ కార్యాలయం వద్ద పంచాయతీ కార్మికులు నిరసన తెలిపారు. పదేళ్లుగా పంచాయతీ కార్మికులు పల్లె ప్రగతిలో భాగస్వాములయ్యారని, అయితే వారికి జీతాలు సరిగా ఇవ్వడం లేదని, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం అసలే లేదని నాగభూషణం ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి పంచాయతీ కార్మికుల కష్టాలను తీర్చాలని కోరారు. లేకుంటే పెద్ద ఎత్తున ఉద్యమం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు కరీముల్లా, రంగయ్య, వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్మిక కార్మికులు మోహన్, చిన్నా, మారయ్య, విజయమ్మ, చంగల్రాయులు, మునెమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు: సత్యవేడులోని గ్రీన్ అంబాసిడర్లకు 41 నెలల వేతనాలు ఇవ్వకుంటే ఈనెల 22 నుంచి పోరాటాలకు సిద్ధం కానున్నామని సీఐటీయూ డివిజన్ కార్యదర్శి ఎం రమేష్ డిమాండు చేశారు. సోమవారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ గత 41 నెలలుగా జీతాలు ఇవ్వకుండా వైసీపీ ప్రచారం చేసుకుంటూ కార్మికుల బాధను అర్థం చేసుకోవడం లేదని.. కరోనా సందర్భంలోనూ కార్మికులు సేవలందించారని తెలిపారు. కార్మికుల వేతనాలు ఇవ్వకుంటే 22వ తేదీన గ్రీన్ అంబాసిడర్లు సత్యవేడు పట్టణంలో భిక్షాటన చేయనున్నట్లు నిర్ణయించారు. సమావేశంలో శేఖర్, చంద్రబాబు, మునుస్వామి, సుబ్రహ్మణ్యం, చిన్నబ్బాయి, కుప్పయ్య, బాబు, గోవిందస్వామి, మురుగయ్య, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంగణ నియామకాల్లో 32 మంది ఎంపిక

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: స్థానిక హిమజ డిగ్రీ కళాశాలలో సోమవారం నిర్వహించిన ప్రాంగణ ఎంపికల్లో 127 మంది పాల్గొనగా 32 మంది అభ్యర్థులు వివిధ ఉద్యోగాలకు ఎంపికయ్యారని హెచ్ఆర్ అంజన్, కళాశాల ఛైర్మన్ సురేంద్రరాజు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ లోకనాథంరెడ్డి, వైస్ ప్రిన్సిపల్ ఆర్.పురుషోత్తంరాజు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సాగు భూములకు పట్టాలివ్వాలి

ప్రజాశక్తి-బాలాయపల్లి: సాగు భూములకు పట్టాలు ఇవ్వాలని సోమవారం సిపిఐ ఆధ్వర్యంలో తహసీల్దారుకు వినతిపత్రం అందించారు. సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి బాలకష్ణయ్య మాట్లాడుతూ మండలంలోని చిలమనూరు గ్రామ సర్వే నెంబరు 187-2, 187- 4 లోని భూమిని 27 కుటుంబాల వారు గత 30 సంవత్సరాల నుండి సాగు చేసుకుంటున్నారని.. భూములకు పట్టాలు ఇవ్వాలన్నారు. ఇక సుబ్రహ్మణ్యం గ్రామంలో 70 కుటుంబాలు గత 40 సంవత్సరాల నుండి సర్వేనెంబర్ 98లో సాగుచే సుకుంటున్న భూములకు 140 పట్టాలు ఇవ్వాలని కోరారు. దీంతో తహసీల్దారు స్పందించి వీఆర్‌వోలను పిలిపించి జూన్ ఒకటి నుండి ఆ గ్రామాల్లో తిరిగి సాగుదారుల లిస్టు తయారు చేయాలని ఆదేశించారు. మండలంలోని భూసమస్యలను నెలరోజుల్లో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం అధ్యక్షులు, కార్యదర్శి వెంకయ్య, కచేపల్లి అంకయ్య, ఢిల్లీ, సాగుదారులు గిరి, బుజ్జయ్య తదితరులు పాల్గొన్నారు.

మేరిగ ప్రమాణ స్వీకారంలో మైనారిటీ నాయకులు

ప్రజాశక్తి-గూడూరు టౌన్: తాడేపల్లిలోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సచివాలయంలో జరిగిన స్థానిక సంస్థల శాసన మండలి సభ్యులు మేరిగ మురళీధర్ ప్రమాణ స్వీకారానికి అత్యధిక సంఖ్యలో గూడూరు నియోజకవర్గ నాయకులు, అభిమానులు హాజరయ్యారు. అలాగే గూడూరు పట్టణంలోని మైనారిటీ నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైసీపీ రాష్ట్ర కార్యదర్శి మొహమ్మద్ మగ్దూమ్ మొహిద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి జలీల్, తిరుపతి జిల్లా కార్యవర్గ సభ్యుడు షేక్.కాలేష, బాబు, యస్దాని, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై తొలగని చెత్త

ప్రజాశక్తి-పుత్తూరు టౌన్: పుత్తూరు పట్టణంలోని 14వ వార్డు షాప్ వీధిలోని చివరలో రోడ్డుపైనే మురుగునీరు దర్శనమిస్తోంది. అలాగే చెత్తాచెదారం సైతం తొలగించడం లేదు. చెత్తను తీయడంలో ఆలస్యం చేస్తుండటంతో చెత్త పేరుకుపోతోంది. స్థానికులు దోమల కారణంగా రోగాల బారిన పడుతున్నారు. మున్సిపల్ అధికారులు స్పందించి వెంటనే చర్యలు తీసుకోవాలని.. లేనిపక్షంలో మున్సిపల్ కార్యాలయం ఎదుట ఆందోళన చేపడుతామని స్థానికులు హెచ్చరించారు.

నాడు-నేడు పనులు పూర్తి చేయాలి



ప్రజాశక్తి-బుచ్చినాయుడుకండ్రిగ : బీఎన్ కండ్రిగలో జరిగిన ఉపాధ్యాయుల సమావేశానికి పుత్తూరు డివిజన్ ఉప విద్యాశాఖాధికారి రఘురామయ్య సోమవారం హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాడు-నేడు పనులు జూన్ 12వ తేదీలోపు పూర్తి చేయాలని, విద్యాకానుకలను పాఠశాల ప్రారంభం నుంచే విద్యార్థులకు పంపిణీ చేయాలన్నారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించేలా పాఠశాల పరిధిలోని గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఉన్నత పాఠశాలలో పది ప్రత్యేక తరగతులను పరిశీలించి విద్యార్థులకు సూచనలు చేశారు. ఎంఈవో రవీంద్రనాథ్, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు సంక్రాంతి వెంకటయ్య, రాపూరు సుబ్రమణ్యం, బి.గంగయ్యలు ఆ పార్టీ ప్రాథమిక సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఆ పార్టీ అనుబంధ ప్రజాసంఘం ఐఎఫ్టీయూ నుంచి వైదొలుగుతూ సోమవారం నిర్ణయం తీసుకున్నారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లా పార్టీ నాయకత్వం ఏకపక్ష నిర్ణయాలకు పాల్పడటం, నిర్మాణ బలహీనతలను అధిగమించలేకపోవడం, ఆర్థిక పరమైన అంశాల్లో జవాబుదారీతనంగా వ్యవహరించకపోవడం, పార్టీ ఆదర్శాలకు భిన్నంగా వ్యవహరించడం లాంటి విషయాలతో ఏకీభవించలేక తాము మూకుమ్మడిగా రాజీనామా చేస్తున్నట్లు వివరించారు. త్వరలో తమ రాజకీయ భవిష్యత్తు ప్రణాళికను ప్రకటిస్తామన్నారు.

ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు పట్టణంలోని షాదీ మంజిల్‌లో మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో పేద ముస్లిం పిల్లలకు ఉచిత ఖత్న కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఉచితంగా మందులు అందించారు. నెట్వర్క్ సభ్యులు రియాజ్ అహ్మద్ మాట్లాడుతూ మహమ్మదీయన్ వెల్ఫేర్ నెట్వర్క్ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని.. అలాగే ఏటా ఉచిత ఖత్న కార్యక్రమం నిర్విరామంగా సాగిస్తున్నామని తెలిపారు. రాబోయే రోజుల్లో సేవా కార్యక్రమాలు విస్తతం చేస్తామని వెల్లడించారు. సుమారు 150 మంది పిల్లలు ఖత్నకు హాజరయ్యారు. కార్యక్రమంలో కాలేషా, యూసఫ్, అజీజ్ , ప్రధానోపాధ్యాయులు రవుఫ్, అజీజ్ ఖాన్, జిలాని, ఖాదర్‌బాషా, నజీర్‌బాషా తదితరులు పాల్గొన్నారు.

కిలివేటిని కలిసిన గౌడ సంఘం ఉపాధ్యక్షుడు

ప్రజాశక్తి - బాలాయపల్లి : బాలాయపల్లి మండల గౌడ సంఘం ఉపాధ్యక్షుడు పర్చూరు శ్రీనివాసులు గౌడ్ సోమవారం ఓజలి మండలం వినుగుంట గ్రామానికి గడప గడపకు మన ప్రభుత్వం

కార్యక్ర మానికి సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య హాజరు కావడంతో మర్యాదపూర్వకంగా కలిసి సన్మానం చేశారు. గౌడ సంఘ సమస్యలపై ఆయన దృష్టికి తీసుకొచ్చారు.

డంపింగ్‌యార్డు పనులు పూర్తిచేయాలి

ప్రజాశక్తి-గూడూరు టౌన్: డంపింగ్‌యార్డు పనులు త్వరగా పూర్తిచేయాలని స్వచ్ఛ ఆంధ్ర కార్పొరేషన్ కార్యాలయంలో ఆ సంస్థ ఛైర్‌పర్సన్ పొంణకా దేవసేనమ్మ అధికారులకు సూచించారు. సోమవారం విజయవాడలోని తన కార్యాలయంలో అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా స్వచ్ఛతపై రాష్ట్రంలో జరుగుతున్న పనులపై చర్చించారు. కార్యక్రమంలో స్వచ్ఛ ఆంధ్ర మేనేజింగ్ డైరెక్టర్ బసంత్ కుమార్, సీవో కిరణ్ కుమార్, నాయకులు కోదండ రామయ్య, గోపాల్ యాదవ్, ముని, సాయి తదితరులు పాల్గొన్నారు.

రసాభాసగా సర్వసభ్య సమావేశం

ప్రజాశక్తి-కోట: స్థానిక మండల పరిషత్తు కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం రసాభాసగా జరిగింది. గత సమస్యలకు పరిష్కారం లేదని అధికారులతో టిడిపి నాయకులు వాగ్వాదానికి దిగారు. కోట వైస్ ఎంపీపీ ఉప్పల శేషయ్య గౌడ్ ఆధ్వర్యంలో సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించారు. పలు శాఖ అధికారులు నివేదికలను వివరిస్తుండగా స్థానిక ప్రజా ప్రతినిధులు అడిగిన పలు ప్రశ్నలకు సరైన సమాధానం చెప్పలేక అధికారులు మౌనంగా ఉండిపోయారు. టిడిపి నాయకులు కోట ఎంపీటీసీ షంషుద్దీన్, దారా సురేష్ అధికారులతో మాట్లాడుతూ కోట పంచాయతీలో నీటి సమస్య అత్యధికంగా ఉందని, ప్రస్తుత ఎండాకాలంలో నీటి సమస్య లేకుండా ప్రజలను కాపాడాలని సంబంధిత అధికారులను నిలదీశారు. పంచాయతీల్లో పలుచోట్ల

మురుగునీటి కాలువల్లో చెత్తాచెదారం ఉందని..ప్రజలందరూ దోమల కారణంగా అనారోగ్యానికి గురవుతున్నారని వాపోయారు. ఎంపీడీవో భవాని మాట్లాడుతూ సమావేశంలో తీసుకొచ్చిన సమస్యలపై వెంటనే చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఇన్చార్జి తహశీల్దారు మల్లికార్జునరావు, పలు శాఖల అధికారులు, ప్రజా ప్రతినిధులు, సర్పంచులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపైనే మురుగు..!

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): పాలకుల నిర్లక్ష్యం కారణంగా కాలనీల్లో మురుగునీరు, తెలుగు గంగ వథా నీరు రోడ్డుపై ప్రవహిస్తోంది. స్థానిక ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నా.. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. మంగళం పంచాయతీ నారా చంద్రబాబునాయుడు కాలనీ మార్గంలో మంగళం చెరువుకు వెళ్లే మురుగు నీటి కాలువ కాలానుగుణంగా ఆక్రమణలతో కుదించబడింది. ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీగా ఉన్నప్పుడు ఈ కాలువలో మురుగునీరు ఏనాడూ రోడ్లపై ప్రవహించలేదని.. కాలువను మళ్లించి చిన్నపాటి కాలువగా నిర్మాణం చేశారని, దీంతో పెద్ద వర్షాలు వచ్చినప్పుడు, కాలువలో వ్యర్థాలు పేరుకుపోయినప్పుడు ఇలా రోజుల తరబడి రోడ్లపై మురుగునీరు ప్రవహిస్తుందని స్థానికులు చెబుతున్నారు. నారా చంద్రబాబు నాయుడు కాలనీ నుండి మంగళం క్వార్టర్స్ మధ్య కల్వర్టు నిర్మాణం చేపట్టి మురుగునీరు సాఫీగా వెళ్లడానికి మార్గం ఏర్పాటు చేయాలని స్థానికులు ఇటీవల అధికారులకు, పాలకులకు, తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డికి తన మహా పాదయాత్రలో పర్యటించినప్పుడు ప్రజలు విజ్ఞప్తి చేశారు. సమస్య పరిష్కారం కోసం కల్వర్టు నిర్మాణానికి నిధులు మంజూరు చేయడం జరిగింది. అయితే కల్వర్టు నిర్మాణానికి టెండర్ దక్కించుకొని ఆరు నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు నిర్మాణం చేపట్టలేదు. ఫలితంగా కాలువలో వ్యర్థాలు చేరి మంగళం క్వార్టర్స్ వద్ద రోడ్డుపై మురుగునీరు పొంగిపొర్లుతూ అటుగా ప్రయాణించే వారికి, పాదచారులకు తీవ్ర అసౌకర్యాన్ని కలిగిస్తోంది.

- ● పాలకుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపం
- ● రోగాల బారిన మంగళం వాసులు
- ● పట్టించుకోని అధికారులు
- ● కల్వర్టు నిర్మాణం చేపట్టాలని వినతి

కల్వర్టు నిర్మాణం త్వరగా చేపట్టాలి

కొన్నేళ్లుగా మురుగునీటి కాలువతో ఇబ్బందులకు గురవుతున్నాం. వ్యర్థాలు చేరి కాలువ మూసుకుపోయినప్పుడల్లా తూతూమంత్రంగా పనులు చేస్తున్నారు. తిరుపతి రూరల్ మండలం ఎంపీపీ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి నిధులు మంజూరు చేసినా ఇప్పటివరకు కల్వర్టు నిర్మాణం చేపట్ట లేదంటే స్థానికుల సమస్యలపై ప్రజాప్రతినిధులకు ఉన్న చిత్తశుద్ధి ఇట్టే తెలుస్తోంది. త్వరగా కల్వర్టు నిర్మాణాన్ని పూర్తి చేయాలి.

త్వరలో కల్వర్టు నిర్మాణం

మురుగునీటి కాలువతో ప్రజలు ఇబ్బందులు పడటం వాస్తవం. సోమవారం జెసిబితో వ్యర్థాలను తొలగించాం. చిన్న చిన్న కారణాలతో ఆలస్యమైన కల్వర్టు నిర్మాణాన్ని త్వరలో ప్రారంభించి పూర్తి చేస్తాం.

- రాజమస్తానయ్య, పంచాయతీరాజ్ ఏఈ

రక్తదానంతో ప్రాణాలు నిలుపుదాం..!

ప్రజాశక్తి-గూడూరు టౌన్: తిరుపతి జిల్లా సిపిఎం పార్టీ చెన్నూరు కమిటీ ఆధ్వర్యంలో ఈనెల 19వ తేదీ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 38వ వర్థంతి సందర్భంగా భారీగా రక్తదాన శిబిరాన్ని కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయనున్నట్లు కమిటీ నిర్వాహకులు గూడూరు ప్రభుత్వాసుపత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డాక్టర్ షరీనాకి సోమవారం వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య నెల్లూరు జిల్లా విడవలూరు మండలం అలగానుపాడు గ్రామంలో సంపన్నుల కుటుంబంలో పుట్టి, బడుగు, దళిత, బలహీన, కార్మిక, కర్షక, రైతు, వ్యవసాయ, కూలీ, యువజన విద్యార్థుల హక్కుల కోసం, పోరాటాలు చేసి మహోన్నత వ్యక్తి అన్నారు. ఈనెల 19వ తేదీన చెన్నూరు గ్రామంలో రక్తదానం చేసి పలువురి ప్రాణాలను కాపాడుకుందాం అనే నినాదంతో బస్టాండ్ సెంటర్లో రక్తదాన శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో చెన్నూరు శాఖ సీపీఎం పార్టీ కార్యదర్శి కామ్రేడ్ గుర్రం రమణయ్య, గూడూరు

సి.పి.ఎం. సెంటర్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్, శాఖ సభ్యులు రాయవరపు శ్రీనివాసులు, నారి వెంకటప్పయ్య, శ్రీనివాసులు, సి.ఐ.టి.యు జిల్లా ఆటో కార్మిక సంఘం నాయకులు బి.వి. రమణయ్య, కె.వి.పి.ఎస్. నాయకులు అడపాల ప్రసాద్, యస్.సురేష్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మధుసూదన్‌రెడ్డి జన్మదిన వేడుకలు



ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదిన వేడుకలు సోమవారం పట్టణంలో ఘనంగా జరిగాయి. స్థానిక నగిర వీధి బేరివారి మండపం వద్ద ఆయన పుట్టినరోజు పండుగను వేడుకగా నిర్వహించారు. నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 70 వేల మంది ఎమ్మెల్యే పుట్టినరోజు వేడుకలకు హాజరై శుభాకాంక్షలు తెలియజేశారు. భారీగా తరలివచ్చిన అభిమానులు, కార్యకర్తల నడుమ ఆయన భారీ కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. పలువు ప్రముఖులు ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు. పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేసిన వారిలో టిటిడి పాలకమండలి సభ్యురాలు వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి, తిరుపతి ఎంపీ గురుమూర్తి, సత్యవేడు ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం, టిటిడి బోర్డు మెంబర్ పోకల అశోక్, ఎమ్మెల్సీ బలి చక్రవర్తి, విన్ టీవీ ఛైర్మన్ డా.టి దేవనదాన్ యాదవ్, ఆర్డీవో రామారావు, పాలకమండలి ఛైర్మన్ అంజూరు శ్రీనివాసులు పాల్గొన్నారు.

రేణిగుంట: శ్రీకాళహస్తి చరిత్రలో కనివిని ఎరుగని రీతిలో అశేష జనవాహిని మధ్య శ్రీకాళహస్తి నియోజకవర్గం ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి జన్మదినాన్ని జరుపుకున్నారని విప్పమానుపట్టెడ సర్పంచ్ లక్ష్మీపతిరెడ్డి స్పష్టం చేశారు. సోమవారం ఎమ్మెల్యే జన్మదినం సందర్భంగా

విప్పమానుపట్టెడ సర్పంచ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని శాలువాతో సన్మానించారు. శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలోఉపసర్పంచ్ గోవిందరాజులు, వార్డు మెంబర్ అమ్ములు, వైసీపీ కార్యకర్తలు దినేష్, హరి మనార్, బక్కయ్య, మురళి, వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.